ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
చిత్తూరు
జిల్లా వార్తలు
మంగళవారం 5 మార్చి 2024

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

● అట్టుంటనా!

వీరప్పన్‌కీ జై..!

'ఇదేందబ్బా ఇదా.. అడివి దొంగకు జై కొడతా వుండారు?' అని ఎవురికైనా డౌట్ కొట్టొచ్చు. తప్పు.. అయప్ప అడివి దొంగకాదు, దేవుడు. అలా కొట్టడంలో తప్పు లేదు. మీరు అబద్ధమనుకుంటే ఈ కత ఓపిగ్గా ఇనాల. ఇయ్యాల రేపు.. నిజమైన వీరప్పన్ పాపం అడివిలోనే తిరిగి, ఆడనే చచ్చిపాయె. కానీ దీనబ్బడాల్ది.. ఆయప్ప తలను తన్నే వీరప్పన్‌లు ఇప్పుడు మనుషుల్లోనే శానామంది తిరగతా ఉండారు గదా. వీరప్పన్‌కు వీరాభిమనులు ఆంధ్రా-తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న కుప్పం నియోజకవర్గంలోనే శానా ఊళ్లల్లోనే ఉండారు. అది వారి అబిమానం, మనం కాదనడానికి లేదు సామీ. ఇక్కడ అదికాదు కత. అట్టా ఒకూళ్లో ఆయనమీద అబిమానంతో కట్టుకున్న స్మారక దిమ్మకు రాజకీయ నాయకులు దిలాసాగా పూజలు చేసి ప్రారంబించేసినారంట. అదిగదా మీరిప్పుడు ఇనబోయే అసలు కత. ఆ ఊరు శాంతిపురం మండలంలో ఉండాది. ఆదోరంనాడు అధికార పార్టీవోల్లు రాజ్యాంగ పదవిలో ఉండే ఒక నాయకుడి నాయకత్వంలో ఆడికి పొలోమంటా ఎల్లిపాయిరి. ఈల్లు ఎల్లేకాడికి అక్కడ పార్టీ జెండాతో ఒక స్తూపం, దానిపక్కనే ఆ ఊళ్లో ఎక్కువమంది ఉండే కులపోల్ల జెండాతో ఇంకో స్తూపం ఉండాయి. పార్టీ జెండాతో ఉన్న స్తూపం మింద చచ్చిపొయ్యేదాకా ఒక జాతీయ పార్టీలో ఉండి, ముఖ్యమంత్రిత్వం కూడా చేసిన పెద్దాయన ఫోటోతోగూడా రాజ్యాంగ పదవిలోని నాయకుని నాయిన ఫోటో ఉండాది. ఎంత బాగా అరైన్ జేసినారు ఈ ఊళ్లో మన కులపోల్లు.. అని ఆ నాయకుడు సంబరపడిపోతా ఉండాడు. ఈలోగా 'అనా అనా ఆపక్క జూడనా..' అని అనుచరుడొకడు చెప్తే జూసి గతుక్కుమన్నాడాయప్ప. పార్టీ జెండా స్తూపం పక్కనే ఆయన కులపోళ్లు ఇంకో దిమ్మెను కట్టేసి ఉండారు. అది గాదు... ఆ దిమ్మమీద అడివిదొంగ వీరప్పన్ ఇంతేసి మీసాలతో దర్జాగా నిలబడి ఉన్న ఫోటో తాపడం చేసి ఉండాది. అంటే జాతీయ పార్టీలో జీవితాంతం గడిపిన దివంగత నాయకుడు, రాజ్యాంగ పదవిలోని నాయకుని తండ్రి ఫోటోల సరసన వీరప్పన్ ఫోటో ఉండాదన్నమాట దాదాపు. గతుక్కుమన్నాడు ఆ నాయకుడు అదిజూసి. మా దేవుడు వీరప్పన్, ఈయప్ప స్మారక స్తూపాన్ని గూడా ఆవిష్కరించి తీరాల్సిందేనంటా కులపోల్లు ఒకటే పోరు. ఇదేందప్పా.. ఈ పితలాటకం అని తలపట్టుకున్నాడంట. అయితే ఆయప్పతోపాటు ఉండిన మండల నాయకుడు మాత్రం ఆ నాయకుడిని చేయిపట్టి తీసుకోనెల్లి... ఆ ఊరి సొంత కులపోల్లు డిమాండ్ జేసినట్లు వీరప్పన్‌కు సైతం పూజలు చేయించి, ఆ స్మారక స్తూపాన్ని ఆయన చేతులమీదుగా ఆవిష్కరింపజేసేసినాడు. వీరప్పన్ దేవుడంటూ ఆ మండల నాయకుడు స్పీచ్ ఇస్తావుంటే ఇంటా ఉండిపొయ్యినాడు. చివరాకరుకు వీరప్పన్‌కు జై అంటా నినాదాలు గూడా చేసినాక గానీ ఆ ఊరి సొంత కులపోల్లు ఇడిసిపెట్టలేదంట ఆ నాయకుడిని. అసలే ఎలక్షన్లు మీదపడిపోతా వుండాయి. కాదంటే ఏం తంటా వస్తాదోనని వీరప్పన్‌కు జై కొట్టేసి గమ్మున ఎనక్కు తిరిగి వొచ్చేసినాడాయప్ప. ఆదోరం మొత్తం సోషల్ మీడియాలో ఈ ఫోటోలు తెగ చక్కర్లు కొట్టినాయి. వాటితోపాటు వీరప్పన్ దివ్యత్వాన్ని పొగుడుతూ భక్తులు రాసిన రాతలు గూడా పారవశ్యాన్ని కలిగించినాయి. సోమారంనాడు పద్దన లేచి జూసేతాలికి ఒక్కటంటే ఒక్క ఫోటో కనిపించలేదంటే నమ్మాలి మీరు. 'దేవుడు' వీరప్పన్ స్తూపాన్ని ఆవిష్కరించినందుకు సిగ్గుపడినారో ఏందో నాయకులు తెలీదు. 'అయినా, ఇందులో సిగ్గుపడేదానికి ఏముండాదప్పా... మనోల్లలో శానామందికి వీరప్పన్ ఆశయాలు ఉండేది నిజమే గదా..' అని ఆ పార్టీ కార్యకర్తలు ఆశ్చర్యపోతా ఉండారంట.

- కుప్పం


వీరప్పన్ ఫొటోతో ఉన్న స్మారక స్తూపం



అమ్మ ఒడి చూపారు. పేద పిల్లలకు కార్పొరేట్ విద్యను దూరం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బెస్ట్ అవైలబుల్ స్కీమ్ (బాస్)ను నిలిపేశారు. చివరకు ఈ స్కీమ్‌ను కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా.. పెండింగు బిల్లులు విడుదల చేయక.. వెళ్లిపోయిన విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించే విషయంలోనూ ప్రభుత్వం చొరవ చూపడంలేదు. - చిత్తూరు

ఇదేంటి 'బాస్'

- వైసీపీ వచ్చాక రద్దయిన పథకం
- పేద విద్యార్థులకు దూరమైన కార్పొరేట్ విద్య
- సుప్రీంకోర్టు ఆదేశించినా అదే నిర్లక్ష్యం
- పెండింగులోనే మూడేళ్ల బిల్లులు

పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించేందుకు టీడీపీ ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీమ్ (బాస్) తీసుకొచ్చింది. మూడో తరగతి నుంచి ఈ స్కీమ్ ద్వారా ప్రవేశం కల్పించేవారు. ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రులు తమకు ఇష్టమైన, దగ్గరగా ఉన్న పాఠశాలలను ఎంపిక చేసుకునేవారు. ఈ విద్యార్థులకు పుస్తకాలతో పాటు యూనిఫామ్, షూస్, నాణ్యమైన భోజనం అందించేవారు. దీంతో ఈ పథకానికి మంచి ఆదరణ లభించింది. ఉమ్మడి జిల్లాలోని 30 కార్పొరేట్ పాఠశాలల్లో సుమారు 1500 మంది విద్యార్థులు చదువుకునేవారు. వీరి బిల్లులను మూడు నెలలకోసారి ప్రభుత్వం ఆయా పాఠశాలల ఖాతాల్లో జమ చేసేది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే అమ్మఒడి కింద నగదు ఇస్తున్నందున ప్రత్యేకంగా ఈ పథకం వద్దంటూ 'బాస్'ను రద్దు చేసింది. 2019-20లో కొత్తగా ఎంపికలు జరపకూడదని ఆదేశాలు జారీచేసింది. అప్పటి వరకు ఈ స్కీమ్ ద్వారా చదువుతున్న విద్యార్థులను సమీప ప్రభుత్వ పాఠశాలలు లేదా రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించుకోవాలని పేర్కొంది. అదే సమయంలో రాష్ట్రంలోని కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మరోవైపు పిల్లలను తీసుకెళ్లాలని లేదా ఫీజులు చెల్లించాలంటూ పాఠశాలల యాజమాన్యాలు చెప్పాయి. ఈ క్రమంలో పిల్లలతో కలిసి తల్లిదండ్రులు కలెక్టరేట్ వద్ద పలుమార్లు ధర్నాలు చేశారు. పథకాన్ని రద్దు చేయరాదని, సుప్రీంకోర్టులో కేసు ఉన్న నేపథ్యంలో బిల్లులు వస్తాయని, తమ పిల్లలను పాఠశాలల్లో కొనసాగించాలని డిమాండు చేశారు. ఇలా ఆందోళనలు చేసినప్పుడల్లా అధికారులు ఆయా పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడారు. ఇలా మూడేళ్లు గడిచాయి. పాఠశాలల ఒత్తిడితో కొందరు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించారు. ఇంకొందరు కూలీనాలీ చేసి ఫీజులు కట్టించి చదివించుకుంటున్నారు. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు బాస్ స్కీమ్‌ను యథావిధిగా కొనసాగించాలని ఆరు నెలల కిందట ఆదేశించింది. ఈ పథకం కింద చదువుతున్న విద్యార్థులను ఆయా పాఠశాలల్లోనే కొనసాగించడంతో పాటు ఏటా కొత్త ప్రవేశాలు కల్పించాలని పేర్కొంది. దీనిపై స్పందించిన ప్రభుత్వం మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లిస్తామని చెప్పింది. పథకం రద్దుతో కార్పొరేట్ పాఠశాలల నుంచి వెళ్లిపోయిన విద్యార్థులను తిరిగి చేర్పించేందుకు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించి చేతులు దులుపుకుంది. మూడేళ్ల పెండింగ్ బకాయిలు ఉండటం.. తిరిగి చేర్చుకుంటే ఫీజులు ఎప్పుడు వస్తాయో అనే భయంతో కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ముందుకురావడం లేదు. ఇటీవల జరిగిన స్పందనలో కూడా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

ఆరు నెలలుగా ఆర్థికశాఖలోనే బిల్లులు

వైసీపీ అధికారంలోకి వచ్చిన మూడేళ్ల వరకు బాస్ స్కీమ్‌లో పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించలేదు. దాంతో టీసీలు అడిగిన విద్యార్థుల తల్లిదండ్రులకు పెండింగ్ బిల్లులను చెల్లిస్తేనే ఇస్తామని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చెప్పాయి. ఇదే విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రైవేటు యాజమాన్యాలు కూడా బిల్లులను విడుదల చేయాలని కోర్టుకెళ్లారు. విధిలేని పరిస్థితుల్లో 2020-21లో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న 1450 మంది విద్యార్థులకు సంబంధించి రూ.3.50 కోట్లు, 2021-22లో 267 మందికిగాను రూ.50 లక్షలకు బిల్లులు పెట్టారు. ఈ బిల్లులన్నీ ఆర్థికశాఖలో పెండింగులో ఉన్నాయి.

స్వగ్రామాలకు చేరిన ఇద్దరు విద్యార్థుల మృతదేహాలు



మోనిష్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ తదితరులు - మోనిష్ (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, మార్చి 4: విహార యాత్రకు వెళ్లి.. తమిళనాడు రాష్ట్రం మహాబలిపురంలో సముద్ర స్నానానికి దిగి గల్లంతై మృతిచెందిన విద్యార్థుల్లో మోనిష్, ప్రభు మృతదేహాలు సోమవారం ఆయా గ్రామాలకు చేరాయి. ఇక్కడి మృతుల్లో ముగ్గురు జిల్లాకు చెందిన వారు కావడం విషాదం. వీరిలోనూ ఇద్దరు వెటర్నరీ విద్యార్థులైన విజయ్‌కుమార్, మోనిష్‌ది బంగారుపాళ్యం మండలం నలగాంపల్లి పంచాయతీ కేసీ కండిగ గ్రామం. విజయ్‌కుమార్ మృతదేహానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించగా, సోమవారం చంద్రబాబు కుమారుడు మోనిష్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీ మోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, నాయకులు జనార్దన్ గౌడ్, చిన్నయ్య, గిరిబాబు, ఎన్‌పీఎస్ శివ, కుటుంబసభ్యులు, స్నేహితులు మోనిష్ మృతదేహానికి నివాళులర్పించారు.

శోకసంద్రంలో దిన్నె ఎస్సీ కాలనీ



ప్రభు (ఫైల్‌ఫొటో) - ప్రభు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరు: పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీ దిన్నె ఎస్సీ కాలనీకి సోమవారం ప్రభు మృతదేహం చేరుకోవడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. పలమనేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతూ గత శనివారం విహారయాత్రకు వెళ్లి మహాబలిపురం సముద్రంలో గల్లంతైన వారిలో శివరాణెమ్మ కుమారుడు ప్రభు (19) ఉన్నారు. ఇతడి మృతదేహం బయటపడటంతో సోమవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. కళాశాల విద్యార్థులు, సమీప గ్రామాల ప్రజలు మృతదేహాన్ని చూసేందుకు పెద్ద ఎత్తున వచ్చారు. గ్రామానికి సమీపంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆ ముగ్గురికి ఘన నివాళి



పలమనేరు, మార్చి 4: పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో చదువుకుంటూ విహార యాత్రకు వెళ్లి మృతిచెందిన ముగ్గురు విద్యార్థులకు సోమవారం నివాళులర్పించారు. మౌనిష్, విజయ్, ప్రభు చిత్రపటాలను కళాశాలలో ఉంచి ప్రిన్సిపాల్ ఎం. వెంకటేసులు, వైస్ ప్రిన్సిపాల్ విజయశేఖరం, అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించి.. ఆవేదన చెందారు.

102 శాతం పోలియో చుక్కలు


కుక్కలపల్లి ఇటుక బట్టీలో ఉన్న పిల్లలకు టీకాలు వేస్తున్న డీఎంవో శ్రీనివాసులు

చిత్తూరు రూరల్, మార్చి 4: ఇంటింటి పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆది, సోమవారం రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 2,15,239 మందికి అంటే 102.51 శాతం పోలియో చుక్కలు వేసినట్లు డీఐవో రవిరాజు సోమవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని వారిని గుర్తించి, ఇంటింటికి వెళ్లి వేయించామన్నారు. మారుమూల ప్రాంతాల్లోకి వెళ్లి పోలియో చుక్కలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా డీఎంవో శ్రీనివాసులు స్థానిక కుక్కలపల్లిలోని ఇటుక బట్టీలో ఉన్న పిల్లలను గుర్తించి, పోలియో చుక్కలు వేశారు.

టెన్త్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

చిత్తూరు (సెంట్రల్), మార్చి 4: జిల్లాలో ఈనెల 18 నుంచి జరిగే టెన్త్ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని పరిశీలకుడు మస్తానయ్య, విద్యాశాఖ డైరెక్టర్ సీమార్టు తెలిపారు. చిత్తూరులోని పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో డీఈవో దేవరాజు, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వీరు మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు సహకరించాలన్నారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 1127 మంది గైర్హాజరు

జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఇంగ్లీష్ పరీక్షకు 1127 మంది గైర్హాజరైనట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. 18440 మంది విద్యార్థులకు గాను 17313 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. డీవీఈవో నాలుగు కేంద్రాలు, పరీక్షల కమిటీ 14 కేంద్రాలు, స్క్వాడ్ 10 కేంద్రాలను పరిశీలించారు.

ఎనిమిదిమందికి షోకాజ్ నోటీసులు

● శిక్షణ తరగతులకు గైర్హాజరవడంతో చర్యలు



చిత్తూరు కలెక్టరేట్, మార్చి 4: 'ఎన్నికల విధుల నిర్వహణలో ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేయకపోవడం ధిక్కారస్వరంగా కనిపిస్తోంది. సమావేశానికి గైర్హాజరుతో వారి నిర్లక్ష్యం బయట పడుతోంది' అంటూ ఎనిమిది మంది సెక్టోరల్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ సోమవారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. చిత్తూరులోని జడ్పీ మీటింగ్ హాలులో సెక్టోరల్ అధికారులకు నిర్వహించే శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులకు గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వీరిలో పుంగనూరు ప్రభుత్వ జూనియర్ కాలేజి లెక్చరర్ తేజేశ్వరి, నగరి ఎంఈవో పీఎస్ శ్రీదేవి, పుత్తూరు పీఆర్&ఆర్డీ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఎం. శ్రీనివాసులు, వడమాలపేట ఇరిగేషన్‌శాఖ ఏఈ ఎస్.కవిత, గంగాధరనెల్లూరు పీఆర్ విభాగ క్వాలిటీ కంట్రోల్ ఏఈఈ వి.అజయ్, పూతలపట్టు పీఆర్ ఏఈఈ టి.వి.ప్రసాద్ నాయుడు, ఐరాల, బంగారుపాళ్యం ఎంఈవోలు దామోదర నాయుడు, ఎస్.రమేష్ బాబు ఉన్నారు. షోకాజ్ నోటీసులు అందిన వెంటనే తమ సంజాయిషీని కలెక్టరేట్‌కు అందజేయాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఎన్నికల విధుల్లో అలక్ష్యం వహిస్తే వేటే

ఎన్నికల విధుల్లో అలక్ష్యం ప్రదర్శిస్తే సస్పెన్షన్ వేటు ఖాయమని కలెక్టర్ షన్మోహన్ హెచ్చరించారు. సోమవారం జరిగిన సెక్టోరల్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధుల్లో సెక్టోరల్ అధికారులకు మేజిస్ట్రేట్ పవర్స్ కల్పిస్తున్నట్లు వివరించారు. గత ఎన్నికల్లో సమీప పోలింగ్‌కేంద్రాల్లో ఎంసీసీ ఉల్లంఘన కేసులు ఉంటే వాటిని పరిశీలించాలని చెప్పారు. పోలింగ్ రోజు ఈవీఎంలకు సంబంధించి సమస్యలు ఉత్పన్నమైతే, పరిష్కరించే దిశగా అవగాహన కలిగి ఉండాలని జేసీ శ్రీనివాసులు సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ రాజశేఖర్, ఇతర అధికారులు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

కె.లక్ష్మీరెడ్డిపల్లె వద్ద పేలుడు

- రాళ్లు పగలగొట్టడానికి మందుగుండు వాడిన స్టోన్ క్రషర్ సిబ్బంది
- పగిలిన ఇళ్ల కిటికీల అద్దాలు.. పగుళ్లిచ్చిన గోడలు


పగుళ్లిచ్చిన ఇంటి ప్రహరీ


పగిలిన కిటికీ అద్దాలు

గంగాధరనెల్లూరు, మార్చి 4: గంగాధర నెల్లూరు మండలం కె.లక్ష్మీరెడ్డిపల్లె సమీపంలోని స్టోన్‌క్రషర్ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో పెద్దఎత్తున పేలుడు సంభవించింది. ఈ శబ్దానికి స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనతో కె.లక్ష్మీరెడ్డిపల్లెలో సుమారు 20 ఇళ్లల్లోని కిటికీలు, గాలి కిటికీలు, షోకేస్‌ల అద్దాలు పగిలాయి. ఐదారు ఇళ్లకు సంబంధించి గోడలు బీటలువారాయి. ఈ స్టోన్ క్రషర్‌ను చిత్తూరు సంతపేటకు చెందిన శ్రీధర్ లైసెన్స్ హోల్డర్‌గా వ్యవహరిస్తున్నట్లు గ్రామస్తులు చెప్పారు. అతడి నుంచి అబ్దుల్లా లీజుకు తీసుకుని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాళ్లను పగులగొట్టడానికి మందుగుండు సామగ్రితో పేలుస్తున్నారు. దీనివల్ల తమ ఇళ్లకు నష్టం వాటిల్లుతోందని గతంలో పలుసార్లు వీరు నిర్వాహకులతో గొడవకు దిగారు. మళ్లీ సోమవారం పేలుడు జరగడంపై వీరంతా ఆగ్రహించారు. స్టోన్ క్రషర్ ప్రాంతానికి చేరుకుని అక్కడి సిబ్బందిని నిలదీశారు. లీజు యజమానిని రప్పించాలని డిమాండు చేశారు. పేలుడు వచ్చిన ప్రాంతాన్ని తాము చూడాలని పట్టుపట్టగా.. అక్కడికి వెళితే ఇంకా ఏదైన పేలుళ్లు జరిగితే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందంటూ సిబ్బంది వీరికి సర్దిచెప్పారు. ఈ ఘటనపై వీరు పోలీసులకు ఫోనుద్వారా సమాచారం ఇచ్చారు. దీనిపై సీఐ శంకర్‌ను వివరణ కోరగా.. స్టోన్ క్రషర్‌కు సంబంధించి పత్రాలు, రాతమూలకంగా వివరాలు అందజేయాలని స్టోన్ సిబ్బందిని ఆదేశించామని చెప్పారు. ఆ రికార్డులు అందాక కేసు నమోదుచేసి చర్యలు తీసుకుంటామన్నారు.


స్టోన్‌క్రషర్ వద్ద సిబ్బందిని నిలదీస్తున్న గ్రామస్తులు

CHITTOOR MUNICIPAL CORPORATION

Roc.No:2963/2023/E1 Dated : 04.03.2024

E-Procurement Short Tender Notice

Tenders are invited from eligibile contractors for **01 work** under General Funds **Rs.9.99 Lakhs** through e-procurement by under signed.

Sl.No	Bid down loading starting date and time	Last date & time for receipt of Bids
01	05-03-2024@4.00 PM	11-03-2024@4.00 PM

Further details contact at **9849907886** during the office hours on all working days.

Sd/- Dr. J.ARUNA, Commissioner, Chittoor Municipal Corporation

KUPPAM MUNICIPALITY
'e' Procurement Tender Notice

Roc.No: 1827/2023/E1 Dt: 21-02-2024 and 04-03-2024
Tender Notice No. 1827/2023/AE, Dt. : 21-02-2024 and 04-03-2024

1. No. of Works	: 15 No's
2. T.S.Amount/E.C.V. Amount	: 128.90 Lakhs
3. Bid Document Downloading Start Date	: 21-02-2024 at 5.30 PM & 04-03-2024 5.30 PM
4. Bid Document Downloading End Date	: 06-03-2024 at 3.00 PM & 19-03-2024 3.00 PM
5. Bid Document Submission Closing Date	: 06-03-2024 at 3.30 PM & 19-03-2024 3.30 PM
6. Price Bid Opening Date	: 06-03-2024 at 3.31 PM & 19-03-2024 3.31 PM
7. Name & Address of the Concerned Officer	: Commissioner, Kuppam Municipality, Kuppam - 517425. Cell : 98499 01049.

Further details can be seen @ 'e' procurement market place at **https://tender.apeprocurement.gov.in** from 21-02-2024 at 5-30 PM and 04-03-2024 at 5.30 PM

Sd/- **Commissioner**, Kuppam Municipality

ఎన్నికలకు తమిళనాడు పోలీసులు సహకరించాలి

చిత్తూరు, మార్చి 4: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణా అడ్డుకునేందుకు తమిళనాడు పోలీసులు సహరించాలని ఎస్ఈబీ ఏఎస్పీ సుబ్బరాజు కోరారు. సోమవారం చిత్తూరులో తమిళనాడు రాష్ట్రం వేలూరు సెబ్ ఏఎస్పీ భాస్కర్, అధికారులతో అంతర్రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. రానున్న ఎన్నికలను పురస్కరించుకుని సరిహద్దు ప్రాంతాల వద్ద ఏర్పాటు చేసే చెక్‌పోస్టులు, వేలూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్స్, అంతర్రాష్ట్ర నేరస్థుల గురించి, సారా రవాణాపై చర్చించారు. చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, గుడియాత్తం డీఎస్పీ రవిచంద్రన్, కాట్పాడి డీఎస్పీ శ్రావణ్, వేలూరు ఎన్నికల సెల్ డీఎస్పీ ఇరుదిరాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

15 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

బంగారుపాళ్యం, మార్చి 4: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని, లారీని సోమవారం అధికారులు పట్టుకున్నారు. బంగారుపాళ్యం మండలం నలగాంపల్లె వద్ద తిరుపతి విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రామకృష్ణ నాయక్, సిబ్బంది, మండల ఆర్ఎస్ డీటీ ఇబ్రహీం వాహనాల తనిఖీ చేపట్టారు. నగరి నుంచి బెంగళూరు వెళ్తున్న లారీని (ఏపీ03 టీఎఫ్0549) తనిఖీ చేయగా, అందులో 316 బస్తాల (15,800 కేజీల) రేషన్ బియ్యం పట్టుబడింది. బియ్యం తరలిస్తున్న తిరువణ్ణామలైకి చెందిన శరవణన్, కాంచీపురానికి చెందిన నాగరత్నంను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజరావు తెలిపారు. లారీని స్వాధీనం చేసుకుని, బియ్యాన్ని గోదాముకు తరలించారు.

కాణిపాకంలో అభివృద్ధి పనుల ప్రారంభం


కాణిపాకంలో లడ్డూ పోటు ప్రారంభిస్తున్న మంత్రులు

ఐరాల(కాణిపాకం), మార్చి 4: కాణిపాకంలో రూ.59 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కొట్టు సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. వరసిద్ధుడి ఆలయంవద్ద రూ.150 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు మంత్రి కొట్టు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాలలో రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నట్లు చెప్పారు. ఎంపీ రెడ్డెప్ప, చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, ఈఈ వెంకటనారాయణ, నేతలు విజయానందరెడ్డి, జగన్నాథరెడ్డి, సునీల్‌కుమార్, గణేష్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేం చెబితేనే మీకు పదవులొచ్చాయి

● అసమ్మతి నాయకులపై మంత్రి రోజా భర్త సెల్వమణి వ్యాఖ్యలు

పుత్తూరు అర్బన్, మార్చి 4: 'మా సమ్మతితోనే మీకు పదవులు వచ్చాయి. మండలం మొత్తం వద్దన్నా వడమాలపేటకు చెందిన వైసీపీ నాయకుడు మురళీధర రెడ్డిని జడ్పీటీసీ చేశాం. చక్రపాణిరెడ్డికి శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవికి లెటర్ ఇవ్వడంతో పాటు సీఎంవోలో కూడా చెప్పాం. నగరికి చెందిన కేజే కుమార్‌కు స్థానిక నాయకత్వానికి మధ్య కొంత అభిప్రాయబేధాలు ఉండడంతో ఆయనను రాష్ట్రస్థాయి పదవికి ఎంపిక చేయడంలో మా పాత్ర ఉంది' అని మంత్రి రోజా భర్త సెల్వమణి వ్యాఖ్యానించారు. ఆదివారం నగరిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మండల కమిటీల సన్మాన కార్యక్రమం సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. మంత్రి రోజా కూడా, ఏ రోజూ తాను వారి క్వారీ వ్యాపారాలకు అడ్డుపడలేదన్నారు.

తగ్గేదేలే!

శిలాఫలకాల తొలగింపుపై జిల్లా అధికారులకు ఫిర్యాదు

వడమాలపేట, మార్చి 4:ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం, శిలాఫలకాల తొలగింపు వ్యవహారంపై వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, మంత్రి రోజా అసమ్మతి నాయకుడు జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వడమాలపేట మండలంలో గత ఆదివారం అప్పలాయగుంట, పత్తిపుత్తూరుల్లో పూర్తయిన సచివాలయ, ఆర్బీకే , పాలవెల్లువ భవనాలను నిబంధనల మేరకు ప్రోటోకాల్ జడ్పీటీసీ సభ్యుడిగా తాను ప్రారంభించినట్లు తెలిపారు. మంత్రి ఒత్తిడితో సంబంధిత పంచాయితీ రాజ్ శాఖ అధికారులు మూడు రోజుల తరువాత వాటిని తొలగించారన్నారు. ఈ అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పందన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశకు, ఏఎస్పీ కులశేఖర్‌కు, జడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. జడ్పీటీసీ సభ్యుడిగా తనకు సమాచారం లేకుండా మళ్లీ అదే భవనాలను ఆర్భాటంగా మంత్రి రోజా ప్రారంభించారని, ఈ విషయమై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని చెప్పారు.

వెంకన్న సేవలో సమంత



తిరుమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):సినీ నటి సమంత సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపలకు వచ్చిన సమంతను చూసేందుకు యాత్రికులు ఉత్సాహం చూపారు. ఆమెతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.20 కోట్లు

తిరుమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.20 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించారు. ఈమేరకు ఆదాయం లభించినట్లు సోమవారం ఉదయం టీటీడీ ప్రకటించింది. ఆదివారం 76,876 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,424 మంది తలనీలాలు సమర్పించారు.

దొంగ ఓట్లు వేసుకునేందుకే ఎస్పీ బదిలీ

● మలికా గర్గ్ బదిలీపై టీడీపీ, జనసేన ఆందోళన

తిరుపతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్పీ మలికా గర్గ్ బదిలీపై విపక్షాలు మండిపడ్డాయి. వైసీపీ నేతల ఒత్తిళ్లతోనే బాధ్యతలు చేపట్టిన మూడు వారాలు కూడా కాకుండానే ఆమెను హఠాత్తుగా బదిలీ చేశారంటూ ఆందోళన చేపట్టాయి.టీడీపీ-జనసేన శ్రేణులు సోమవారం ఉదయం ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసనకు దిగాయి. తిరుపతి ప్రశాంతతను కాపాడాలని, ఎస్పీ బదిలీ నిర్ణయా న్ని వెనక్కి తీసుకోవాలన్న నినాదాలతో హోరెత్తించాయి. సమాచా రం అందుకున్న పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకుని వెస్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ ఎన్నికల్లో వైసీపీ అరాచకాలను ఉపేక్షించబోదన్న అనుమానంతోనే సిన్సియర్ అధికారిగా పేరున్న గర్గ్‌ను అర్థంతరంగా బదిలీ చేశారని మండిపడ్డారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆమె పార్టీలకతీతంగా పారదర్శకంగా పనిచేయడం అధికార పార్టీ నేతలకు మింగుడుపడలేదన్నారు.రాబోయే ఎన్నికల్లో కూడా దొంగ ఓట్లతో గెలవాలని భావిస్తున్న వైసీపీ నేతలు ఎస్పీ అడ్డుకట్ట వేస్తుందని భావించే బదిలీ చేయించారన్నారు. మరో నాలుగు రోజుల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటుండగా నిజాయితీ కలిగిన మహిళా పోలీస్ అధికారిని బదిలీచేయడం బాధాకరమన్నారు. ఆందోళన చేస్తున్న వారిలో 24మందిని అదుపులోకి తీసుకుని వెస్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు బైండోవర్ కేసులు పెట్టారు. మధ్యాహ్నం 2.30 గంటలపైన సంతకా లు తీసుకుని విడుదల చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్నవారిలో టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, పులిగోరు మురళీకృష్ణా రెడ్డి, ఊకా విజయకుమార్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, బుల్లెట్ రమణ, చినబాబు, కంకణాల రజనీకాంత్ నాయుడు, రుద్రకోటి సదాశివం, మునిశేఖర్ రాయల్, పెరుమాళ్ మధు, ఆముదాల తులసీరాం, కరాటే చంద్ర, మునిరామయ్య, వేణుగోపాల నాయుడు, జయకుమా ర్, ఆనంద నాయుడు, పూజారి రాజారాం, జనసేన నాయకులు రాజారెడ్డి, ముక్కు సత్యవంతుడు, కొండ రాజా, దినేష్, రాజేష్, రుద్ర కిషోర్ తదితరులున్నారు. టీడీపీ నాయకులు రవినాయుడు, బ్యాంకు శాంతమ్మ, హేమ, అనిత, విశ్వనాథం తదితరులు వెస్ట్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళనకారులకు సంఘీభావం ప్రకటించారు.

నేత్రపర్వం...ధ్వజారోహణం

● శివనామస్మరణతో మార్మోగిన ముక్కంటి ఆలయం
● వెండి అంబారీపై ఆది దంపతుల పుర విహారం




ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, మార్చి 4 : శ్రీకాళహస్తీశ్వరాలయ శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ధ్వజా రోహణ వేడుక వేదోక్తంగా జరిగింది.మధ్యాహ్నం ప్రారంభమైన వేడుక సాయంత్రం వరకూ జరగ్గా భక్తుల శివనామ స్మరణతో ఆలయం మార్మోగింది.ఉదయం స్వామి అమ్మవార్ల మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్ర జలాలను ఆలయంలో చల్లుతూ శుద్ధి చేశారు. అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లు వెండి అంబారీ వాహనంపై ఆశీనులయ్యారు, వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామి, చండికేశ్వరుడి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి హారతులు సమర్పించారు. అనంతరం ఆలయం నుంచి శివయ్య గోపురం, రాజగోపురం మీదుగా వాహనాల మండపం వద్దకు తీసుకువచ్చారు.పంచమూర్తుల ఊరేగింపు చతుర్మాడ వీధుల్లో కనులపండువగా సాగింది. అనంతరం పంచమూర్తులను స్వామివారి గర్భాలయం వద్ద ఉన్న స్వర్ణతాపడ ధ్వజస్తంభం వద్ద కొలువుదీర్చారు. అలాగే ఉమాదేవి సమేత చంద్రశేఖర స్వామి త్రిశూలానికి ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ధ్వజారోహణం చేసే కొడి దారాన్ని పురవీధుల్లో సాంప్రదాయబద్ధంగా ఊరేగించారు. కలశ స్థాపనతో వేదోక్తంగా సంకల్ప పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య హోమం, పూజాది కైంకర్యాలు నిర్వహించాక ధ్వజస్తంభానికి దర్భధారణ చేశారు. మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య భక్తులు సమర్పించిన కొడి చీరలను ధవళ పతాకంతో కలిపి సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజస్తంభానికి అధి రోహింపజేశారు.సాయంత్రం ఆరుగంటలకు ఆలయంలోని యాగశాలలో కలశస్థాపనతో విశేష పూజలు చేశారు. చతుర్మాడ వీధుల్లో వెలసిన నవ సంధి వినాయకులను శివపార్వతుల కళ్యాణానికి విచ్చేయాలంటూ క్షేత్రధర్మంగా అర్చకులు ఆహ్వానం పలికారు. రాత్రి వెండి అంబారీ వాహనంపై స్వామి అమ్మవార్లు పుర వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు.ముందుగా ప్రచార రథం, స్వాగత తోరణాలు, గొడుగులు, మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు, వివిధ కళాకారుల వాయిద్యాలు, వేషధారుల ప్రదర్శనలు ఊరేగింపులో భక్తులను ఆకట్టుకున్నాయి.అనువంశిక ప్రధాన అర్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్, ప్రధాన అర్చకులు, ఆలయ మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.ఉదయం ఊరేగింపులో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి పాల్గొన్నారు.


వెండి అంబారీపై ఆది దంపతుల ఊరేగింపు

నేడు భూత, శుక వాహన సేవలు

శివరాత్రి ఉత్సవాల్లో మంగళవారం భూతరాత్రిని పురస్కరించుకుని భూత గణాలకు ఆధిపత్యం వహిస్తున్న పరమేశ్వరుడు భూత వాహనంపై, ఆయన దేవేరి జ్ఞానప్రసూనాంబిక చిలుక వాహనంపై పురవీధుల్లో ఊరేగనున్నారు. ఉదయం సూర్య ప్రభపై స్వామివారు, చప్పరంపై అమ్మవారు ఊరేగనున్నారు.

రెస్కోలో ఉద్యోగాలపై విచారణ జరపాలి

● 'స్పందన'లో సీపీఐ నేతల ఫిర్యాదు ● కలెక్టరేట్ వద్ద ఆందోళన

చిత్తూరు, మార్చి 4: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. బాధితుల నుంచి అధికారులు వినతిపత్రాలను స్వీకరించారు. వీటిలో కొన్నింటిని పరిశీలిస్తే.. కుప్పం రెస్కోలో ఉద్యోగ నియామకాల పట్ల కలెక్టర్ జోక్యం చేసుకుని పాలకవర్గంపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. కుప్పం రెస్కో సంస్థలో పదవీ విరమణ పొందిన స్థానంలో రెస్కో పాలకవర్గం నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. స్పందన కార్యక్రమంలోనూ ఫిర్యాదు చేశారు. రెస్కోలో పదవీ విరమణ పొందిన సుబ్రహ్మణ్యం స్థానంలో ఎండీగా ఉద్యోగం పొందడానికి ఎలాంటి అర్హత లేని వారిని పాలకవర్గం నియమించడం సరైన పద్ధతి కాదన్నారు. రెస్కో ఎండీగా ఉండటానికి కనీస విద్యార్హత, నియమ నిబంధనలు ఉన్నప్పటికీ వాటన్నింటికీ పట్టించుకోకుండా పాలకవర్గం నియమించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని పూర్తి స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

సీఎంసీ ఆస్పత్రికి భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజన్ డిమాండు చేశారు. గుడిపాల మండలంలోని 190 రామాపురం దళితులకు సంబంధించిన భూములను సీఎంసీ ఆస్పత్రి కోసం ప్రభుత్వం సేకరించిందన్నారు. 2009లో భూములను తీసుకున్నా ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని పరిహారం అందేలా చూడాలని కోరారు.

పోలీసు స్పందనకు 23 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 23 మంది తమ సమస్యలను ఎస్పీ జాషువా దృష్టికి తీసుకెళ్ళారు. వీటిలో ఆస్తి తగాదాల కింద 8, చీటింగ్ 4, వేధింపులు 4, భూ తగాదాలు 3, కుటుంబ తగాదాలు 2, ఇంటి తగాదా ఒకటి, భర్త వేధింపులు ఒకటి చొప్పున అర్జీలు అందాయి. ఏఎస్పీ అరీఫుల్లా, ఎస్బీ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలకు 64 సర్క్యులర్‌ను రద్దు చేయాలి

వీవోఏలకు ప్రమాదకరమైన సర్క్యులర్ 64ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వీవోఏలకు మూడు సంవత్సరాల కాలపరిమితి పెడుతూ సర్క్యులర్ 64ను తీసుకురావడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు అన్నారు. వీవోఏలకు జెండర్ విధానాన్ని రద్దు చేయాలని, కనీసన వేతనాలను అమలు చేయాలని, రాజకీయ వేధింపులను మానుకోవాలని డిమాండ్‌చేశారు. యూనియన్ నేతలు శీను, రాజశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీవోఏలు

కలెక్టరేట్ స్పందనకు 327 అర్జీలు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనకు 327 మంది హాజరై సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో రెవెన్యూశాఖకు 279, జిల్లా పౌరసరఫరాలశాఖకు 14, పోలీసుశాఖకు 4, జిల్లా ఎంప్లాయిమెంట్‌శాఖకు 3 అర్జీలు అందగా మిగిలిన శాఖలకు అర్జీలు అందాయి.


బాధితులతో మాట్లాడుతున్న డీఆర్వో పుల్లయ్య

సారొస్తారని.. సమస్యలు చెప్పాలని..!

● నిరీక్షించి.. ఉసూరుమంటూ వెనుదిరిగిన బాధితులు ● 'స్పందన'లేని చిత్తూరు రెవెన్యూ అధికారులు



చిత్తూరు రూరల్: తహసీల్దారు సారొస్తారని.. తన సమస్య విన్నవించాలని నిరీక్షించి.. నీరసించి.. చెట్టుకింద దిమ్మెపై పడుకున్న 80 ఏళ్ల వృక్తిని చూశారా? ఈయనది చిత్తూరు మండలం అనుపల్లి హరిజనవాడ. పేరు జాన్. తన 5.20 ఎకరాల భూమి సంబంధించిన పాసు పుస్తకం 15 ఏళ్ల క్రితం ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయింది. కొత్త పాసు పుస్తకం కోసం వందలసార్లు అర్జీలు సమర్పించారు. సరిగా కూడా నడవలేని స్థితిలో కార్యాలయానికి వస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పుడొచ్చిన తహసీల్దార్‌కు తన గోడు చెప్పుకొందామని అనుకున్నారు. సాధారణ రోజుల్లో చిత్తూరు తహసీల్దార్ అర్జీదారులను కలవరట. అందుకని సోమవారం వరకు ఆగి.. స్పందనలో అర్జీ ఇవ్వడానికి ఉదయాన్నే వచ్చారు. తహసీల్దారు పని నిమిత్తం బయటకు వెళ్లారని ఉద్యోగులు చెప్పారు. డీటీ కూడా వెళ్లారట. మంత్రి కార్యక్రమంలో ప్రొటోకాల్ కోసం ఆర్ఐ వెళ్లారు. అర్జీలు తీసుకునే వారే లేరు. దీంతో ఇలా చెట్టు కింద మధ్యాహ్నం వరకు ఎదురు చూశారు. చివరకు అధికారులు రాకపోవడంతో వచ్చే సోమవారం వరకు ఆగాల్సిందేనా అంటూ ఆవేదనతో ఇంటిదారి పట్టారు. ఇంకా ఎన్నేళ్లు తిప్పించుకుంటారని బాధపడుతూ వెళ్లారు.

పట్టాకోసం ఎస్టీలు..



చిత్తూరు నగరం రెడ్డిగుంట ఎస్టీ కాలనీకి చెందిన ఎస్టీలకు కొంత భూమి ఉంది. అందులోని కాస్త పంటలు వేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ భూమికి పట్టా లేదు. ఈ భూ పంపిణీలో పట్టాలు ఇప్పిస్తామని చెప్పి ఓ ఉద్యోగి వీరి వద్ద కొంత మొత్తం తీసుకున్నట్లు తెలుస్తోంది. 8 మందిలో ఇద్దరికి పట్టా వచ్చింది. మిగతా ఆరుగురికి రాలేదు. తమ సమస్యను తహసీల్దార్‌కు చెప్పేందుకు వచ్చిన వీరు.. మధ్యాహ్నం వరకు వేచి చూసి వెనుదిరిగారు. ఇలా పలువురు బాధితులు నిరాశతో వెళ్లారు. 'స్పందన' రోజు అధికారులంతా కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలన్నది నిబంధన. కానీ, తహసీల్దారు కార్యాలయంలో 'స్పందన' లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

గంజాయి స్మగ్లింగ్‌లో ప్రజాప్రతినిధి హస్తం

● అరెస్టు చేస్తారన్న భయంతోనే ఎస్పీని బదిలీ చేయించారు ● బీజేపీ నేతల సంచలన ఆరోపణ

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 4: గంజాయి స్మగ్లింగ్‌లో స్థానిక ప్రజాప్రతినిధి హస్తం వున్నట్లు ఎస్పీ విచారణలో బయటపడటంతో ఎక్కడ అరెస్టు చేస్తారో అనే భయంతోనే ఎస్పీ మలిక గార్గ్‌ను బదిలీ చేయించారని బీజేపీ అధికార ప్రతినిధులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన తిరుపతిని వైసీపీ నాయకులు గంజాయివనంగా మార్చేశారంటూ ధ్వజమెత్తారు. దొంగ ఓట్లు, గంజాయి స్మగ్లింగ్, టీడీఆర్ బాండ్ల అవినీతిపై ఎస్పీ మలిక గార్గ్ నివేదిక తయారు చేస్తోందని తెలిసి ఎక్కడా తనను అరెస్టు చేస్తారో అనే భయం, ఎన్నికలకు ముందు ఇవన్నీ జరిగితే వైసీపీకి చెడ్డపేరు వస్తుందనే ఆలోచనతో ఎస్పీని బదిలీ చేయించారని ఆరోపించారు. నిజాయితీగా పనిచేసినందుకే వైసీపీ ప్రభుత్వం బదిలీ బహుమానాన్ని ఒక మహిళా అధికారికి అందించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే వైసీపీ మాట విని ఓ ఐఏఎస్ అధికారి సస్పెండయ్యారని గుర్తు చేశారు.అధికార పార్టీ నాయకులు మాట వినకపోవడం ఓ కారణమైతే నిక్కచ్చిగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని పోలీసు యంత్రాంగానికి సమావేశాల్లో ఎస్పీ చెప్పడం వైసీపీ నాయకులకు మింగుడుపడలేదన్నారు.ఈ విషయంపై ముఖ్యమంత్రే జవాబు చెప్పాలన్నారు.బదిలీ చేసిన ఎస్పీని వెంటనే తిరిగి తిరుపతికి బదిలీ చేయాలని, లేకుంటే కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే హైకోర్టుకు వెళతామని స్పష్టం చేశారు.బీజేపీ నాయకులు వరప్రసాద్, జీవన్, భాస్కర్, అజయ్‌కుమార్,శేఖర్,నాదముని తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిని వైసీపీ నాయకులు గంజాయివనంగా మార్చేశారంటూ తులసిమొక్కను చూపుతున్న భానుప్రకాష్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, Shaik Kundel Habeeba W/o Shaik Kundel Shafi, Residing At 10-214, Indira Colony, Mulakalacheruvu (P&m) - 517390, Annamayya (Dist), A.P. Hence I State That My Name Has Been Changed From Shaik Shabeeba (My Old Name) To SHAIK KUNDEL HABEEBA (My New Name)
AJT - 179582

CHANGE OF NAME
I, Shaik Kundel Shafi, S/o Shaik Kundel Hussain Saheb, Residing At 10-214, Indira Colony, Mulakalacheruvu (P&m) - 517390, Annamayya (Dist), A.p. Hence I State That My Name Has Been Changed From Shaik Shaffi (My Old Name) To SHAIK KUNDEL SHAFI (My New Name)
AJT - 179583

CHANGE OF NAME
I, V Ramamoorthy (Old Name), SSC Roll No: 0439641&1320660, R/o: 1-109/A, Dhanalakshmi Nilayam, Mallamgunta, Tirupati Rural, Tirupati-517507, A.P.-Ind. Do Here By Declared That, I Have Changed My Name As RAMANMURTHI VENKATA (New Name) S/o Varadharajan (Aadhar No:218252855418)
AJT - 6157

CHANGE OF NAME
I, Abburi Suneetha R/o 12-1/a, Kammakandriga Village, Gangireddy Palli Post, Ramachandra Puram Mandal, Tirupati Dt, Ap Have Change My Name To Singu Suneetha W/o Singu Seshadri Naidu
AJT - 6155

WANTED
తిరుపతిలో ట్రావెల్స్ ఆఫీస్ నందు పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు కావలెను. Contact : 95503 35727
AJT - 6156

CHANGE OF NAME
I, Pyndramety Suresh, R/o: Palamparthy, Mallem, Chittamur, Tirupati Dt, A. P. Do Here By Declired I Have Changed My Surname As PYNDRAMETI SURESH (New Name) S/o Pyndrameti Alleiah
AJT - 6158

డీలర్స్ కావలెను
ఐషర్ ట్రాక్టర్స్ డీలర్‌షిప్స్ ఆంధ్ర రాష్ట్రమంతటా ఇవ్వబడును. మరియు మా షో రూంలో పనిచేయుటకు యువతీ యువకులు కావలెను. వివరములకు సంప్ర. : 88010 28000, ధనుంజయ ఎంటర్‌ప్రైజెస్, హైదరాబాద్
AJT - 179690

TO-LET
తిరుపతి గాయత్రి నగర్, మహిళా యూనివర్శిటీ ఎదురుగా ఆఫీస్ మరియు రెసిడెన్సీకు ఉపయోగపడే ఇల్లు బాడుగకు కలదు. ఫోన్ : 9490651379
AJT - 179578

WANTED
తిరుపతి, చిత్తూరు, మదనపల్లె లొకేషన్‌లో బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ కోసం మేల్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. DRA సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఫోన్: 93935 05333, 99490 22239
AJT - 179580

WANTED
తిరుచానూరు రోడ్డులోని టిఫిన్ సెంటర్ నందు పనిచేయుటకు దోశ మాస్టర్, పార్శిల్ బాయ్స్, సప్లయర్స్ వెంటనే కావలెను. ఆకర్షణీయమైన జీతం. సెల్ : 99495 17734
AJT - 6145

ప్లాట్స్ ఫర్ సేల్
450 ఎకరాల తిరుమల తిరుపతి దేవస్థాన ఉద్యోగుల ఇళ్ళ స్థలాల పక్కన అయోధ్య టౌన్‌షిప్ నందు తిరుపతి ఐఐటి దగ్గర ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు డైరెక్ట్ ఓనర్ ఫోన్ : 95027 74175 / 7995992114.
AJT - 6140

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 176968

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ CLASSIFIEDS

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కళాశాలలు, పరిశ్రమల
అనుసంధానంతోనే దేశాభివృద్ధి


శిక్షణను ప్రారంభిస్తున్న సునీల్‌రాజ్

కుప్పం, మార్చి4: ఇంజినీరింగ్ కళాశాలలు, పరిశ్రమలతో అనుసంధాన మైనప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతందని కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్‌రాజ్ అన్నారు. కేఈసీలో సోమవారం పరిశ్రమల అనుసంధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులకు సరికొత్త సాంకేతికలతతో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. పాఠ్యాంశాల రూపకల్పన దానిని అనుసరించే జరుగుతుందన్నారు. ఇందువల్ల ఐటీ పరిశ్రమలలో విద్యార్థుల ప్లేస్‌మెంట్ అవకాశాలను మెరుగుపరచడానికి, పరిశ్రమ వాతావరణాన్ని కళాశాలలో ఏర్పరచడానికి దోహదం చేస్తుందన్నారు. ఐటీ పరిశ్రమకు చెందిన సాంకేతిక నిపుణులు జెరోమీ రాజదొరై 'ట్రెండ్స్ అండ్ రెవల్యూషన్ ఇన్ ఐటీ ఇండస్ట్రీ' అనే అంశంపై, యామిని 'ఇంపాక్ట్ ఆఫ్ లో కోడ్ అండ్ ఐ', కీర్తన కన్నన్ 'యుటిలైజేషన్ ఆఫ్ నో కోడ్ టెక్నాలజీ అండ్ క్లౌడ్', ఎమ్మార్.ముత్తునందశివ 'యుటిలైజేషన్ ఆఫ్ లింక్డ్ ఇన్' అనే అంశాలపై బి.టెక్ రెండవ, మూడవ సంవత్సరం విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జయకుమార్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో సంక్షేమ రాజ్యం


కుప్పంలో ప్రచారం చేస్తున్న మనోహర్, రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, మార్చి 4: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో సంక్షేమ రాజ్యం సాకారమవుతుందని చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, ఆ పార్టీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పం మున్సిపాలిటీలోని 22వ వార్డులో వారు సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేకపోగా, నిత్య దౌర్జన్యాలతో బాధలు ఎక్కువయ్యాయని విమర్శించారు. సంక్షేమ పథకాలు అందిస్తున్నానని ఒకవంక చెబుతూ మరో పక్క విపరీతంగా ధరలు పెంచేసి జనం జేబులు జగన్ కొల్లగొడుతున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు కుప్పం పాలిటెక్నిక్ విద్యార్థుల ఎంపిక



కుప్పం, మార్చి 4: కుప్పంలోని డాక్టర్ జేమ్స్ ఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గత నెల 23వ తేదీన జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలకు పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.జగన్నాథం తెలిపారు. ఎలక్ట్రానిక్స్ విభాగంనుంచి 31 మంది, ఎలక్ట్రికల్ విభాగంనుంచి 21, మెకానికల్ విభాగంనుంచి 28 మంది ఉద్యోగం పొందినట్లు పేర్కొన్నారు. వీరికి నెలకు రూ.20 వేల వేతనంతోపాటు అలవెన్సులు కూడా సంస్థ నిబంధనల ప్రకారం లభిస్తాయని చెప్పారు.

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి

గుడుపల్లె, మార్చి 4: చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం బెగ్గిలపల్లె, శెట్టిపల్లె, కంచిబందార్లపల్లె పంచాయతీల్లో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి ఆతరువాత సూపర్ సిక్స్ కరపత్రాలను ఇంటింటా పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ... వైసీపీ ఐదేళ్ల పాలనలో దోపిడి, దౌర్జన్యం, అరాచకం, అవినీతి జరిగిందే గానీ ప్రజలకు ఒరిగింది ఏమి లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీనే ప్రత్యేక హోదా తెస్తుంది

పలమనేరు, మార్చి4 : రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ మాత్రమే ప్రత్యేక హోదా తెస్తుందని, కావున రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పార్థసారథిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం పలమనేరు కాంగ్రెస్ పార్టీ కార్యయలంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత రాష్ట్రంలో అధికారం లోకి వచ్చిన చంద్రబాబు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకు రావడంలో విఫలమయ్యారన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సోమల, మార్చి 4: ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ వెంకట నరసింహులు అన్నారు. సోమవారం సాయంత్రం కందూరు బస్టాండ్‌లో ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వరాదని, మైనర్ పిల్లలు ద్విచక్ర వాహనాలు నడపరాదని, రోడ్డు నిబంధనలు, అధిక వేగం నియంత్రలను పాటించాలన్నారు. రాబోవు ఎన్నికల వేళ ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

చంద్రబాబుతోనే భవిష్యత్ గ్యారెంటీ : గౌనివారి


కరపత్రాలను పంచుతున్న గౌనివారి శ్రీనివాసులు, నాయకులు

శాంతిపురం, మార్చి4: మాజీ ముఖమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు అన్నారు. సోమవారం మండలంలోని పలుగ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగుపడాలంటే చంద్రబాబు ముఖమంత్రి కావాలన్నారు. మాజీ ఎంపీపీ ఉదయ్‌కుమార్, నేతలు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, ఆర్ఎస్ మణి, జయరామిరెడ్డి, నారాయణస్వామి, గోపాల్, రమేష్ రెడ్డి, రుద్రప్ప, భాస్కర్, మునిరెడ్డి, ప్రకాష్, అంజినేయరెడ్డి, పెద్దన్న, ఉయ్యాల జయరామిరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పుంగనూరు తహసీల్దార్‌గా శివయ్య



పుంగనూరు రూరల్, మార్చి4: పుంగనూరు తహసీల్దార్‌గా శివయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాజంపేట నుంచి వచ్చిన సుబ్రహ్మణ్యం రెడ్డి పూతలపట్టుకు బదిలీ కావడంతో అక్కడ పని చేస్తున్న శివరాముడును పుంగనూరుకు కలెక్టర్ షన్మోహన్ బదిలీ చేయగా ఆయన శుక్రవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. అయితే అదేరోజు తహసీల్దార్ శివరాముడును చౌడేపల్లెకు బదిలీ చేసి వెదురుకుప్పం తహసీల్దార్‌గా పని చేస్తున్న శివయ్యను పుంగనూరుకు బదిలీ చేశారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

పుంగనూరు రూరల్, మార్చి4: మండల పరిధిలోని ప్రముఖ శైవక్షేత్రాలకు భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు.అగస్త్యీశ్వరస్వామి కొండపై ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు పుంగనూరు, చౌడేపల్లెల నుంచి అగస్త్యీశ్వరస్వామి కొండ మీదకు ఆర్టీసీ సర్వీసులు నడపనున్నట్లు చెప్పారు. అలాగే సోమల మండలం దుర్గంకొండకు 8, 9 తేదీల్లో ఆర్టీసీ సర్వీసులు నడుస్తాయని, ఈ అవకాశాలను ప్రజలు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు బోయకొండలో సోలార్ ప్లాంట్ ప్రారంభం

చౌడేపల్లె, మార్చి4: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో రూ.1.90 కోట్లతో నూతనంగా నిర్మించిన సోలార్ ప్లాంట్‌ను, పార్కును మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు బోయకొండ గంగమ్మ ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి ఒక ప్రకటన జారీ చేశారు.

హైవేలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు


పలమనేరు మార్కెట్ కమిటీ వద్ద విద్యుత్ స్తంభాలు, జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న స్తంభాలు

పలమనేరు,మార్చి4 : పలమనేరులో జాతీయ రహదారికి ఆనుకునే ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. రెండు దశాబ్దాల క్రితం పట్టణంలో ఉన్న జాతీయ రహదారిని విస్తరించి రోడ్డు మధ్యన డివైడరు కూడా ఏర్పాటు చేశారు. దీంతో అప్పటికే ఉన్న విద్యుత్ స్తంభాలకు కేవలం రెండునుంచి నాలుగు అడుగులలోపు దగ్గరికి రోడ్డు ఏర్పడింది. దీంతో ఈ రహదారిపై ప్రతినిత్యం వెళ్లే వందలాది వాహనాలు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తరచూ ఢీకొనడం, అధికారులు మళ్లీ అదే స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డుకిరువైపులా సుమారు 15 అడుగులు ఖాళీ ప్రదేశం ఉన్నప్పటికీ అధికారులు ఈ స్తంభాలను జాతీయ రహదారికి దూరంగా ఏర్పాటు చేయకపోవడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మూడు నెలల క్రితం కర్ణాటక రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు రాత్రి వేళ ఒక విద్యుత్ స్తంభాన్ని ఢీకొని సుమారు ఫర్లాంగు దూరం లాక్కుపోయింది. అయితే అదృష్టవశాత్తు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఇకనైనా విద్యుత్ అధికారులు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను జాతీయ రహదారికి దూరంగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పట్ర కులస్తుల అభ్యున్నతికి టీడీపీ కృషి

ఎమ్మెల్సీ కంచర్ల హామీ


ఎమ్మెల్సీ కంచర్లకు, పీఎస్ఎంకు వినతిపత్రం ఇజస్తున్న పట్ర కులస్తుల నాయకుడు శ్రీనివాస్ నాయుడు తదితరులు

కుప్పం, మార్చి 4: పట్ర కులస్తుల విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ ఎదుగుదలకు తెలుగుదేశం పార్టీ బాధ్యత వహిస్తుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం హామీ ఇచ్చారు. కుప్పంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం పట్ర కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మల్లానూరు, అడవిబూదుగూరు, కొటాలూరు, బెగ్గిలపల్లె పంచాయతీలు, ఇతర గ్రామాల నుంచి ఈ కులస్తులు తరలివచ్చారు. చంద్రబాబు లక్ష ఓట్ల మెజారిటీతో గెలిచేందుకు తాము కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు ప్రతిన చేశారు. అలాగే తమ సమస్యలు పరిష్కరించాల్సిందిగా టీడీపీ నాయకులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పట్ర కులస్తుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ పట్ర కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. తమను ఎంబీసీ గ్రూపులో చేర్చి 150 యూనిట్ల దాకా ఉచిత కరెంటును ఇవ్వాలని, రూ.50 వేలు నాన్ ఫండబుల్ రుణాలు ఇవ్వాలన్నారు. భూమిలేని నిరుపేదల పట్ర కులస్తులకు భూమిని ఇవ్వడమేకాకక, ఆ వ్యవసాయ భూమికి సరిపడా పనిముట్లు కొనుగోలుకు ఆర్థికసాయం చేయాలని విన్నవించారు. పట్రకులస్తుల విన్నపాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే వారి అభివృద్ధికి కృషి చేస్తామని టీడీపీ నేతలు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, పట్ర కులస్తుల నాయకులు రాజేంద్రన్, చిట్టిబాబు నాయుడు, సంజీవ్‌రాఉ, గోవిందురాజులనాయుడు, సి.ముత్తుకుమార్, రాజీవేలు, పొన్నువేలు, రవీంద్రన్, శివకుమార్, రాజప్ప పాల్గొన్నారు.

వైభవంగా వీరాంజనేయ స్వామి పుష్పపల్లకి సేవ


ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి, స్వామికి పట్టు వస్త్రాలు, సారె తీసుకువస్తున్న వెంకటేగౌడ

వి.కోట,మార్చి4: వి.కోటలో వెలసిన వీరాంజనేయస్వామి 57వ పుష్పపల్లకి సేవను సోమవారం వైభవంగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా ప్రతిఏటా నిర్వహించే పుష్పపల్లకిని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో వి.కోట జనసంద్రంగా మారింది. సోమవారం ఉదయం స్వామికి అభిషేకాలు, విశేష పూజలు జరిపించారు. ఆపై ప్రత్యేక పూలతో స్వామిని అలంకరించారు. సాయంత్రం ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీపీ యువరాజ్, సర్పంచ్ పీ.ఎస్.లక్ష్మి తదితరులు స్వామికి పట్టువస్త్రాలతోపాటు, సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్మాణ నిమిత్తం సర్పంచ్ రూ. లక్ష విరాళంగా ఆలయ ధర్మకర్తకు అందజేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పుష్పపల్లకిపై కొలువుతీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ఇదిలావుండగా బందోబస్తుకు వచ్చిన పెద్దపంజాణి ఎస్ఐ శ్రీనివాసులు తనపై దాడి చేసి తన్నినట్లు టీడీపీ కార్యకర్త బాబు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ క్షమాపణ చెప్పాలంటూ టీడీపీ శ్రేణులు వి.కోటలో ధర్నా చేపట్టారు. ఎస్ఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బీసీవైపీ ఎన్నికల మేనిఫెస్టో ఆవిష్కరణ


మేనిఫెస్టో విడుదల చేస్తున్న బీసీవైపీ నాయకులు

పుంగనూరు, మార్చి4: యువతకు ఉపాధి, రైతుల సంక్షేమం, పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం, రాజకీయ మార్పు కోసం వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనున్న బీసీవై పార్టీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్‌ను ప్రజలు ఆదరించి ఒక్క అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు కోరారు. సోమవారం పుంగనూరులో బీసీవైపీ ఎన్నికల మేనిఫెస్టోను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆర్.హరినాథరెడ్డి, సి.సాంబమూర్తి, సదుం విశ్వనాథరెడ్డి, హరియాదవ్, ఆనంద్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో ప్రతి రైతు కుటుంబానికి ఉచితంగా ఆవు, మూతపడిన చెరుకు ఫ్యాక్టరీ స్థానంలో కొత్త ఫ్యాక్టరీ ఏర్పాటు, ప్రతి మండలంలో డెయిరీ, మామిడి, చింత, టమోటా అనుబంధ పరిశ్రమలు, మెడికల్ కాలేజీ, మహిళా ఉర్దూ డిగ్రీ కాలేజీ, పతంజలి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ, అయ్యప్ప భక్తులకు ఏటా శబరిమలైకు ఉచిత బస్సులు ఏర్పాటు, మక్కాకు వెళ్లేవారికి ఏటా ప్రయాణ ఖర్చుల సాయం, పుంగనూరులో 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు లక్ష్యంగా ఎన్నికల మేనిఫెస్టో సిద్ధం చేసినట్లు వివరించారు. రామచంద్రయాదవ్‌ను పుంగనూరు ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించి అభివృద్ధి, సంక్షేమం, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పొందగలరని తెలిపారు. సమావేశంలో బీసీవైపీ నాయకులు కిరణ్, నూర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగ సంఘం పటిష్టతకు కృషి చేయాలి

పుంగనూరు రూరల్, మార్చి4: విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై పోరాటంతో పాటు సంఘం పటిష్టతకు కృషి చేయాలని సంఘ అధ్యక్షుడు చెంగారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పుంగనూరు విశ్రాంత ఉద్యోగ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, సంఘ సభ్యులు ఎదుర్కొటున్న సమస్యలపై చర్చించినట్లు వివరించారు. సమావేశంలో సంఘ నాయకులు రామకృష్ణారెడ్డి, భరత్‌భూషణ్, వేణుగోపాల్‌రెడ్డి, కేశవరెడ్డి, ద్వారకమ్మ, వరదరాజులు, గంగులమ్మ, ఈశ్వరకుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎర్రయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిపై విమర్శలు తగవు

పుంగనూరు, మార్చి 4: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై బీసీవైపీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ విమర్శలు చేయడం తగదని ఎంపీపీ భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నేతిగుట్లపల్లె, ఆవులపల్లె వద్ద ప్రాజెక్టు నిర్మాణాలు చేస్తుంటే అడ్డుకున్న రామచంద్రయాదవ్ సంక్షేమంపై మాట్లాడటం సిగ్గుచేటుగా ఉందన్నారు. ఈ సమావేశంలో ముడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయూబ్‌ఖాన్‌కు ఘన సన్మానం



పుంగనూరు, మార్చి4: మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ పుంగనూరు అధ్యక్షుడు డాక్టర్ పి.అయూబ్‌ఖాన్‌ను సోమవారం పుంగనూరులో పలువురు ఘనంగా సన్మానించారు. ఇటీవల ఆయన అందిస్తున్న సామాజిక సేవలు, మత సామరస్యంపై అంశాలను దృష్టిలో ఉంచుకుని స్థానికులు ఆత్మీయ అభినందనసభ ఏర్పాటు చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ అయూబ్‌ఖాన్ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘనాయకులు నాగరాజు, గంపల గంగరాజు, కృష్ణమూర్తి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రామకృష్ణారెడ్డిలు ఆయనను పూలమాలలు, శాలువలతో సన్మానించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యకు పాల్పడిన షకీర్‌బాషా

పుంగనూరు రూరల్, మార్చి4: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం పుంగనూరు మండలంలో జరిగింది. వేపమాకులపల్లెకు చెందిన షకీల్ బాషా(33) మద్యానికి అలవాటు పడడంతో కుటుంబంలో కలహాలు చోటు చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. షకీల్‌బాషా మద్యం సేవించి బ్లేడ్‌తో చేతులు, కాళ్లపై కోసుకోవడంతో రక్తగాయాలై జువ్వలదిన్నెతాండా సమీపంలో అపస్మారకస్థితిలో పడివుండటం గుర్తించిన గ్రామస్తులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో పాటు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది గోవర్ధన్, నాగభూషణంలు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన షకీల్‌బాషాను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉందని డాక్టర్లు సూచనల మేరకు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో అగస్త్యీశ్వరస్వామి



పుంగనూరు రూరల్, మార్చి4: నెక్కుంది సమీపంలో వెలసిన అగస్త్యీశ్వరస్వామి సోమవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామికి వృషభయాగం, ధ్వజారోహణం, దిక్పాలకా వాహన, బలిహరణ, నిత్యోత్సవం నిర్వహించారు. అర్చకులు రాజన్నదీక్షితులు, సోమశేఖర్‌దీక్షితులు, చంద్రశేఖర్‌దీక్షితులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

సోలార్ ఘర్ యోజనకు దరఖాస్తుల ఆహ్వానం

సదుం, మార్చి 4: ప్రధానమంత్రి సోలార్ ఘర్ యోజన పథకం ద్వారా రాయితీపై ఇళ్లపై సోలార్ పవర్ ఏర్పాటుకు ఆసక్తి కలిగిన వారు స్థానిక మీ-సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సొంతింటి విద్యుత్ బిల్లుతో మీ-సేవా కేంద్రాల్లో సంప్రదించాలని వారు తెలిపారు.

6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు

గుడుపల్లె, మార్చి 4: మండలంలోని ఎ.కొత్తపల్లె వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భువనేశ్వరి తెలిపారు. బీసీ, ఓబీసీ ఫీజు రూ.150, ఎస్సీ, ఎస్టీలు ఫీజు రూ.75 చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నెల 30 తేదీలోపు వైబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

కల్లూరు, మార్చి 4: పులిచెర్ల మండలంలో మంగళవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటన ఉంటుందని జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ తెలిపారు. పాళెం పంచాయతీలో ముడా నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన పార్కు, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు ప్రాంగణాన్ని మంత్రి ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది హాజరుకావాలని కోరారు.

పాఠశాలలకు సామగ్రి వితరణ

కల్లూరు, మార్చి 4: పులిచెర్ల మండలం వంకాయలపాటివారిపల్లి ప్రాథమిక పాఠశాల, పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు సోమవారం కెనరాబ్యాంకు సీఎస్ఆర్ నిధులతో రూ.5 లక్షలు విలువైన వస్తు సామగ్రిని వితరణ చేశారు. వీకేపల్లి పాఠశాలకు రూ.2లక్షలు విలువైన బీరువాలు, డెస్కులు, శుద్ధ జల యంత్రం, పులిచెర్ల ఉన్నత పాఠశాలకు రూ.3 లక్షలు విలువైన కంప్యూటర్లు, ప్రింటర్లు, శుద్ధ జల యంత్రం, బీరువాలు, డెస్కులు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో హుబ్లీ కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్, తిరుపతి కెనరా బ్యాంకు డివిజనల్ మేనేజర్ శరవణన్, కల్లూరు కెనరా బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, హెచ్ఎంలు సయ్యద్ సాహెబ్ వలి, శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా కార్యదర్శిగా విశ్రాంత ఉపాధ్యాయుడు

పలమనేరు, మార్చి4 : వైసీపీ జిల్లా కార్యదర్శిగా పలమనేరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎన్. సోమచంద్రారెడ్డి నియమితులయ్యారు. ఆమేరకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ భరత్ సోమచంద్రారెడ్డికి నియమకపు ఉత్తర్వులు పంపారు.

ఆర్టీవో స్పందనకు 8 అర్జీలు

పలమనేరు, మార్చి4 : పలమనేరు ఆర్టీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 8 మంది రైతులు అర్జీలు ఇచ్చారు. పెద్దపంజాణి మండలం నుంచి నలుగురు, బైరెడ్డిపల్లి మండలం నుంచి ఇద్దరు, సదుం, సోమల మండలాలనుంచి ఒక్కొక్కరు అర్జీ ఇచ్చారని అధికారులు తెలిపారు. ఆర్టీవో లేనందున ఏవో కుప్పస్వామి రైతులనుంచి అర్జీలు స్వీకరించారు.

వైభవంగా సిద్ధేశ్వరస్వామి జాతర

కుప్పం, మార్చి 4: కుప్పం పురపాలక సంఘం పరిధిలోని పైబాటలో సోమవారం సిద్ధేశ్వరస్వామి జాతర వైభవంగా జరిగింది. కురబ కులస్తుల దైవమైన స్వామివారికి పదేళ్లకోమారు ఈ జాతర చేస్తారు. స్వామివారికి బలులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

ఘనంగా సాయిమందిర వార్షికోత్సవం



సదుం, మార్చి 4: స్థానిక గాంధీ వీధిలో ఉన్న షిరిడీ సాయి మందిరం 20వ వార్షికోత్సవం సోమవారం మందిరం వ్యవస్థాపకులు తుమ్మల నాగభూషణ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, భజనలు, పూజలు నిర్వహించి భక్తులకు అన్న, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నాగభూషణ, భాస్కర, చిన్నమునుస్వామి, రమణయ్య, సుబ్రహ్మణ్యం, గిరీష్ కర్నాడ్, భక్తులు పాల్గొన్నారు.

పొదలగుంటపల్లెలో వేలం పాటలు

సోమల, మార్చి 4: సోమల మండలం పొదలగుంటపల్లె సచివాలయంలో సోమవారం దళవాయి చెరువులో చేపల పెంపకానికి ఈవోపీఆర్డీ లక్ష్మిదేవి వేలం పాటలు నిర్వహించారు. వేలం పాటల్లో బి. విజయకుమార్ రూ.35వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు జయరాం, ఎంపీటీసీ నాగభూషణం రెడ్డి, కార్యదర్శి జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

కుప్పం, మార్చి 4: కుప్పం మున్సిపాలిటీ 15వ వార్డులో నివసించే ఖాదర్‌బాషా అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని సోమవారం తెలుగుదేశం పార్టీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. పార్టీ తరఫున మృతుడి కుటుంబానికి మట్టి ఖర్చులకుగాను రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్, నాయకులు పి.గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, అన్సర్‌బాషా, కన్నన్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో కుప్పం వాసికి ప్రథమ బహుమతి



కుప్పం, మార్చి 4: కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని అనిమిగాని పల్లెకు చెందిన ఎస్.మణికి బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రథమ బహుమతి లభించింది. తమిళనాడు రాష్ట్రం వెల్లూరులో ఆదివారం ఈ పోటీలు జరిగాయి. 65 కిలోల విభాగంలో మణి ప్రథమస్థానంలో నిలిచి బహుమతి పొందారు. నిర్వాహకులతోపాటు గ్రామస్తులు ఆయనను అభినందించారు.

చౌడేపల్లె తహసీల్దార్‌గా శివరాముడు



చౌడేపల్లె,మార్చి4: చౌడేపల్లె తహసీల్దార్‌గా శివ రాముడు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాలతో కర్నూలు జిల్లా నుంచి ఎన్నికల విధులలో భాగంగా పూతలపట్టులో బాధ్యతలు స్వీకరించి, అక్కడి నుంచి పుంగనూరుకు, అక్కడి నుంచి చౌడేపల్లెకు బదిలీ కావటంతో తాను చౌడేపల్లె తహసీల్దార్ గా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.

పలు ప్రారంభోత్సవాలు

పెద్దపంజాణి, మార్చి 4: మండలంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీ రెడ్డెప్ప ప్రారంభించారు. సోమవారం చిన్నేపల్లెలో తాగునీటి ట్యాంకు, సిమెంటు రోడ్డు, భద్రాచలం గ్రామంలో సిమెంటు రోడ్డు, తుర్లపల్లెలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని, కొళత్తూరు, పెదకాప్పల్లెలో సచివాలయ భవనాలను ప్రారంభించారు. ఎంపీపీ రెడ్డెప్ప, జడ్పీటీసీ సుష్మకీర్తి పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

తుంబకుప్పంలో జల్లికట్టు


గిత్తలను నిలువరిస్తున్న యువకులు

బంగారుపాళ్యం, మార్చి 4: మండలంలోని తుంబకుప్పంలో సోమవారం జల్లికట్టు నిర్వహించారు. గ్రామదేవత సత్తెమ్మ ఆలయం వద్ద గోవులకు పూజలు నిర్వహించి, అల్లిని ఏర్పాటు చేసి జల్లికట్టు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువకులు అల్లిలో నిలబడి గిత్తలను ఆపే ప్రయత్నం చేశారు. జల్లికట్టు నిర్వహించడంతో గ్రామంలో జనసందడి నెలకొంది.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి: టీడీపీ


మాట్లాడుతున్న పూతలపట్టు ఇన్‌చార్జి మురళీమోహన్

యాదమరి, మార్చి 4: రానున్న ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ పిలుపునిచ్చారు. యాదమరి మండలం జోడిచింతల వద్ద నిర్వహించనున్న నారా లోకేశ్ శంఖారావం సభకు సంబంధించి పూతలపట్టు నియోజకవర్గ నేతలతో సోమవారం ఆయన భేటీ అయ్యారు. సభాస్థలి వద్ద భూమి పూజ చేశారు. అనంతరం ఆయన పార్టీ నాయకులతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే ఆరు గ్యారెంటీల గురించి ప్రజలకు వివరించాలన్నారు. వైసీపీ దుర్మార్గపు పాలనను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మండలాల అధ్యక్షులు మురార్జీ, జయప్రకాష్ నాయుడు, దిలీప్ నాయుడు, నేతలు వెంకటేశ్ రబి, జనార్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక వనరులతో పల్లెల అభివృద్ధికి కృషిచేయండి


మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్‌పర్సన్ రత్నకుమారి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 4: గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే వనరులను సద్వినియోగం చేసుకుని పల్లెల అభివృద్ధికి కృషిచేయాలని ఐదవ ఆర్థిక సంఘం కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ రత్నకుమారి సూచించారు. సోమవారం ఆర్ అండ్ బీ అతిథిగృహంలో జడ్పీ సీఈవో గ్లోరియా, డీపీవో లక్ష్మీ, ఇతర అధికారులతో సమావేశం జరిగింది. చైర్‌పర్సన్ మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లాపరిషత్ పరిధిలో ఉన్న ఆదాయ, వ్యయ వివరాల గురించి అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. మొండి బకాయిల వసూళ్లకు తీసుకుంటున్న చర్యలను మరింత పెంచాలని చెప్పారు. ఇంటి పన్ను, నీటి పన్ను, క్వారీల ద్వారా వచ్చే ఆదాయాలపై చర్చించారు. జడ్పీ సీఈవో గ్లోరియా మాట్లాడుతూ జిల్లాపరిషత్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామాల్లో పైప్‌లైన్ల విస్తరణ, మోటారు మరమ్మతులు, కరెంటు బిల్లుల బకాయిలకు వినియోగిస్తున్నామని డీపీవో లక్ష్మి వివరించారు. డీపీఆర్సీ షణ్ముగం, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఆదాయం పెంచేలా ప్రణాళికలు

చిత్తూరు: అర్బన్ స్థానిక సంస్థలైన నగర పంచాయతీలు, పుర, నగరపాలక సంస్థల ఆదాయం పెంచే మార్గాలపై తగిన ప్రణాళికలు తయారు చేయడానికి అవసరమైన సమగ్ర సమాచారాన్ని ఇవ్వాలని ఐదవ ఆర్థిక సంఘం కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ రత్నకుమారి చెప్పారు. సోమవారం చిత్తూరు నగర పాలక కార్యాలయంలో జిల్లాలోని నగర, పురపాలక పంచాయతీల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పలమనేరు, నగరి కమిషనర్లు రమణారెడ్డి, మంజునాథ్, ఎంఈ గోమతి, ఏసీపీ రామకృష్ణుడు పాల్గొన్నారు.

'విజయం'లో సైబర్ క్రైంపై వర్క్‌షాప్


పోలీసు అధికారులను సన్మానిస్తున్న విజయం యాజమాన్యం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 4: విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో కళాశాల అధినేత తేజోమూర్తి అధ్యక్షతన సోమవారం విద్యార్థులకు సైబర్ క్రైం, సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్ నిర్వహించారు. సీఐ విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటర్‌నెట్, మొబైల్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. సోషల్ మీడియా వాడుతున్న విద్యార్థులు వారి వ్యక్తిగత సమాచారాన్ని ఫోన్ నెంబర్లను, ఫొటోలను పంపరాదని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ షేక్‌వలి, ఏవో రాజగోపాల్, అధ్యాపకులు రమణ, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ఎమ్మెల్యే తిన్నింటి వాసాలు లెక్కబెట్టే రకం

● మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు, మార్చి 4: చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తిన్నింటి వాసాలు లెక్కబెట్టే రకమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆరణి శ్రీనివాసులు జనసేన పార్టీలో చేరడంపై చిత్తూరులో సోమవారం విలేకరులు ప్రశ్నించగా, ఆయన పైవిధంగా స్పందించారు. చిత్తూరు ఎమ్మెల్యే జనసేన పార్టీలో చేరారని తాను కూడా విన్నానని తెలిపారు. ఇప్పటికే సస్పెండ్ చేశామని, అవసరమైతే అనర్హతవేటుపై పార్టీలో చర్చిస్తామని చెప్పారు.

వైసీపీ బెదిరింపులకు బెదరొద్దు: టీడీపీ

గుడిపాల, మార్చి 4: వైసీపీ బెదిరింపులకు బెదరవద్దని చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు అన్నారు. ఆదివారం మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో జనసేన, టీడీపీ సంయుక్తంగా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మీ పని మీరు చేసుకుంటూ పోండి.. రెచ్చగొడితే కూడా రెచ్చిపోకుండా సహనం పాటించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి సీఎంగా చంద్రబాబును గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ నెల 6వ తేదీన జరిగే బీసీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, మండల జనసేన అధ్యక్షుడు రూప్‌కుమార్, టీడీపీ ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, నేతలు పీటర్, చంద్రమోహన్, మధుసూదన్ నాయుడు, కిట్టు, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవ్ ఎడ్యుకేషన్: ఏఐఎస్ఎఫ్

చిత్తూరు (సెంట్రల్), మార్చి 4: సేవ్ ఎడ్యుకేషన్, రిజెక్ట్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ నినాదంతో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చలపతి, జిల్లా కన్వీనర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని పలు కళాశాలల్లో విద్యార్థుల నుంచి సంతకాల సేకరణ చేశారు. జాతీయ విద్యావిధానం ద్వారా ఎదురయ్యే సమస్యలపై నాయకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

దళిత సత్ర నిర్మాణానికి స్థలం కేటాయిస్తాం: మంత్రి కొట్టు

ఐరాల(కాణిపాకం), మార్చి 4: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో దళిత సత్ర నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. సోమవారం కాణిపాకానికి విచ్చేసిన ఆయన్ను దేవదాయ శాఖ విశ్రాంత ఏడీసీ కేశవులు, పలువురితో కలసి తమ సమస్యలను వివరించారు. కేశవులు మాట్లాడుతూ దళితులు వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం దళితసత్రాన్ని నిర్మించుకుంటామన్నారు. దీనిపైమంత్రి స్పందిస్తూ తనను తన కార్యాలయంలో కలిస్తే సమస్యలన్నింటిని పరిష్కరిస్తానన్నారు.


దేవదాయ శాఖ మంత్రితో మాట్లాడుతున్న విశ్రాంత ఏడీసీ కేశవులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన కేశవరెడ్డి

శ్రీరంగరాజపురం, మార్చి 4: రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్ కళాశాల లెక్చరర్ మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వెదురుకుప్పం మండలం, తాళ్లబైలు గ్రామానికి చెందిన బలరాంరెడ్డి కుమారుడు కేశవరెడ్డి(35) నగరిలో నివాసం ఉంటూ అక్కడ ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసున్నారు. కేశవరెడ్డి తన స్నేహితుడు హరితో కలసి ఆదివారం పూతలపట్టు వేము కాలేజీలో టెట్ పరీక్షలు రాసి తిరిగి రాత్రి ద్విచక్ర వాహనంపై నగరికి వస్తుండగా, మార్గమధ్యంలో ఎస్ఆర్‌పురం మండలం సి.కె. పురం గ్రామం, చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై ఎస్ఆర్‌పురం నుంచి నెలవాయికి చెరకు లోడుతో వెళ్తున్న ఎద్దుల బండిని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కేశవరెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా, హరి గాయపడ్డారు. గాయపడిన హరిని చికిత్స నిమిత్తం 108లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కులాయప్ప సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పూతలపట్టు, మార్చి 4: పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని తలుపులపల్లి సమీపంలోని పొలాల్లో గత కొన్ని రోజులుగా పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సీఐ సుదర్శన్ ప్రసాద్ సోమవారం సాయంత్రం తమ సిబ్బందితో వెళ్లి ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.34 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం

నిండ్ర, మార్చి 4: మండలంలోని కొత్త ఆరూరు ఉన్నత పాఠశాలలో ఆర్ఎంఎస్ఏ నిధులు రూ.55 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను సోమవారం మంత్రి ఆర్‌కే రోజా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, ఎంపీటీసీ రమ్య, తహసీల్దార్ నాగమణి, ఎంపీడీవో భవాని, సర్పంచ్, నాయకులు రాజా, జేఏసీ కన్వీనర్ బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి


విద్యార్థికి డ్రాయింగ్ బుక్ అందచేస్తున్న చెన్నకేశవులు నాయుడు

గుడిపాల, మార్చి 4: విద్యార్థులు తమ మేధోశక్తిని పెంపొందించుకోవాలని జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు డ్రాయింగ్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాద్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు నాణ్యమైన మందులు


జన ఔషధీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాగలక్ష్మి తదితరులు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 4: తక్కువ ధరలకు నాణ్యమైన మందులను కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని పీఎం జన ఔషధీ సంస్థ చైర్‌పర్సన్ నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీడీసీఎంఎస్ భవనంలో ప్రధాన మంత్రి జన ఔషధీ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన మందులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం జన ఔషధీని అందుబాటులోకి తెచ్చిందన్నారు. 50 శాతం ధరలకే ఇక్కడ మందులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆపరేటివ్ అధికారి వనజ, బీజేపీ నాయకులు చిట్టిబాబు, రామభద్ర, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఇన్‌చార్జిని కలిసిన థామస్



కార్వేటినగరం, మార్చి 4: జీడీనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ సోమవారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్న యుగంధర్‌ను ఆయన స్వగృహంలో కలిశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార వైసీపీని ఓడించడానికి టీడీపీ, జనసేన పార్టీలు కలిసి ఉమ్మడిగా ఎన్నికల పోరాటానికి సిద్ధం కావాలని ఇరువురు నాయకులు ఏకాభిప్రాయానికి వచ్చారు. జనసేన పార్టీని టీడీపీ పట్టించుకోవడం లేదన్న ప్రచారాలను తిప్పికొట్టడానికే ఇలా కలిసినట్లు కార్యకర్తలు అభిప్రాయపడ్డారు.

టీడీపీ యువతకు క్రికెట్ కిట్ పంపిణీ



విజయపురం, మార్చి 4: మండలంలోని పన్నూరు దళితవాడలో టీడీపీ యువతకు అదే గ్రామానికి చెందిన ఆ పార్టీ ఎస్సీ సెల్ యువ నాయకుడు శరత్ సోమవారం క్రికెట్ కిట్ పంపిణీ చేశారు. కదలిరా... ఆడుకుందాం కార్యక్రమంలో భాగంగా యువతను క్రీడల్లో ప్రోత్సాహించడానికి ఈ కిట్ పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు.

ఉడమకుడితిలో భవిష్యత్తుకు గ్యారెంటీ

శ్రీరంగరాజపురం, మార్చి 4: మండలంలోని ఉడమకుడితి పంచాయతీలోని పి.వి.పురం, తుంగమిట్ట గ్రామాల్లో సోమవారం టీడీపీ, జనసేన నాయకులు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు చిరంజీవి, టీడీపీ నాయకులు అప్పల్‌రాజు, నాగరాజు, చిన్నబ్బరాజులు, సిద్ధయ్యశెట్టి, కుమార్, జనసేన నాయకులు చందు, కండియాల వెంకటేసు, నరసింహులు, కైలాసం తదితరులు పాల్గొన్నారు.

నేడు చుడా ఆధ్వర్యంలో ప్రారంభోత్సవాలు

చిత్తూరు, మార్చి 4: చుడా ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన పలు ప్రారంభోత్సవాలు చేస్తున్నట్లు వైస్ చైర్మన్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. 5న ఉదయం 9గంటలకు చిత్తూరు నగరశివారులోని కోడిగుంటవద్ద జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్, 9.30గంటలకు సంతపేట పార్కు, 10.30గంటలకు పాళ్యం షటిల్‌కోర్టు, 11గంటలకు సదుంలో పోలీసు మైదానం, 12గంటలకు బోయకొండపార్కును ప్రారంభిస్తారన్నారు.

మహిళా సంక్షేమానికి టీడీపీ పెద్దపీట: గురజాల


సమావేశంలో మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 4: మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చిత్తూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ చెప్పారు. సోమవారం బీవీ రెడ్డి కాలనీలోని జీజేఎం కార్యాలయంలో తెలుగుమహిళలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ మ్యానిఫెస్టోలో మహిళల కోసం ప్రత్యేక పథకాలు ప్రకటించిందని చెప్పారు. ఆడబిడ్డనిధి కింద రూ.18 వేలు, తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, నీటి కుళాయిల ఏర్పాటు కల్పిస్తామని చెప్పారు. చిత్తూరు నియోజకవర్గంలో మహిళలకు అనుకూలమైన చిన్న, మధ్య తరహా పరిశ్రమలను తీసుకువచ్చి ఆర్థిక స్వావలంబన కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. మాజీ మేయర్ కటారి హేమలత మాట్లాడుతూ టీడీపీ పాలనలోనే మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. చిత్తూరు పార్లమెంటు తెలుగుమహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టోను వివరించాలని కోరారు. గురజాల జగన్మోహన్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు కాజూరు బాలాజి, మహిళా నేతలు ఉదయ, రేవతి, విక్టోరియా, దీప, సుమతి, బిందు, అను తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి

వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ఎం.ఆర్ ఉదయ్‌కుమార్ సోమవారం నగరంలోని బీవీరెడ్డి కాలనీలో గురజాల జగన్మోహన్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఉదయ్ కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్ళించి ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. చంద్రబాబు పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అభివృద్ధిచెందారని అన్నారు. రానున్న ఎన్నికల్లో గురజాల జగన్మోహన్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

ఉద్యోగాలకు 38 మంది విద్యార్థుల ఎంపిక


ఉద్యోగ నియామక పత్రాలతో విద్యార్థులు

కార్వేటినగరం, మార్చి 4: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 38మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 29వ తేదీన నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 55 మంది పాల్గొనగా, 38 మందికి సోమవారం సంబంధిత కంపెనీ వారు ధ్రువీకరణ పత్రాలను పంపినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీ.ఎస్.లత, జేకేసీ మెంటార్ టి.లోకేశ్వర్, అధ్యాపకులు బాల సుబ్రమణ్యం ఆచారి, సుబ్బారావు, హరిబాబు, కార్తీక్, రాజశేఖర్, విశ్వనాధం, జోగి ప్రసాద్, సరిత, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు భవిష్యనిధి నగదు అందజేత


లబ్ధిదారులకు డీడీలు అందిస్తున్న మేయర్, అధికారులు

చిత్తూరు, మార్చి 4: నగర పాలక సంస్థ ఉద్యోగులకు సంబంధించి భవిష్యనిధి(పీఎఫ్) సొమ్మును సంబంధిత ఉద్యోగులకు సోమవారం అందించారు. నగర పాలక కార్యాలయంలో మేయర్ అముద, కమిషనర్ అరుణ, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్‌లు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు, మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు పీఎఫ్ నిధులకు సంబంధించిన డీడీలను అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ షర్మిలా ప్యారీ, ఎంఈ గోమతి, మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి, అకౌంట్స్ విభాగం సిబ్బంది కోదండన్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జేడీ


రికార్డులను తనిఖీ చేస్తున్న జేడీ, డీఎంహెచ్ఓ

శ్రీరంగరాజపురం, మార్చి 4: ఎస్ఆర్ పురం మండల పరిధిలోని పీహెచ్‌సీని సోమవారం జేడీ దేవసాగర్, డీఎంహెచ్‌వో ప్రభావతి, జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్‌లు ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పల్స్ పోలియో చుక్కలు 95 శాతం వేయాలన్నారు. మిగిలిన వారికి పోలియో చుక్కలను ఇంటింటికీ వెళ్లి వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఏటీవో జయరాముడు, డాక్టర్లు బాలసుబ్రమణ్యంరెడ్డి, గౌరి, సందీప్, గిరి, సీహెచ్‌వో శ్రీనివాసులు, మునస్వామి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించండి

పాలసముద్రం, మార్చి 4: మండలంలోని పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరక్టర్ దేవసాగర్, డీఎంహెచ్‌వో ప్రభావతి పేర్కొన్నారు. సోమవారం పాలసముద్రం పీహెచ్‌సీని జిల్లా వైద్యశాఖ అధికారుల బృందం తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. రోగులకు పీహెచ్‌సీలో అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లా టీబీ, లెప్రసీ ఆఫీసర్ వెంకటప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో జయరాముడు, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ రవిరాజు, పీహెచ్‌సీ డాక్టర్ మోహన్‌కృష్ణ, సీహెచ్‌వో జ్ఞానశేఖర్ పాల్గొన్నారు.

స్పందన వినతులను సకాలంలో పరిష్కరించండి

చిత్తూరు, మార్చి 4: స్పందన కార్యక్రమంలో అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని నగర కమిషనర్ అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వినతులపై అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్‌కు 02, టౌన్ ప్లానింగ్‌కు 02, ప్రజారోగ్యశాఖకు 01 చొప్పున అర్జీలు అందాయి. ఎంహెచ్‌వో లోకేష్, ఆర్వో వర్మ, మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు

చిత్తూరు, మార్చి 4: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని నగర మేయర్ అముద అధికారులను ఆదేశించారు. నగరంలో తాగునీటి సమస్యను ఎదుర్కొనేందుకు మేయర్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేస్తూ సోమవారం కమిషనర్ అరుణ ఉత్తర్వులు జారీ చేశారు. అధ్యక్షులుగా మేయర్ అముద, మెంబర్ కన్వీనర్‌గా ఎంఈ గోమతి, సభ్యులుగా డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు షర్మిలా ప్యారీ, జ్ఞాన జగదీశ్, నవీన్‌కుమార్‌లను నియమించారు.

6 నుంచి ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం

చిత్తూరు సిటీ, మార్చి 4: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 6 నుంచి 10వ తేదీ వరకు భక్తులకు ద్వాదశ జ్యోతిర్లింగాలు, అమరనాథ మంచులింగ దర్శనభాగ్యాన్ని ఉచితంగా కల్పించనున్నట్లు బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి వసుధ తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆమె ఉత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సాంబయ్యకండ్రిగలోని ఓంశాంతి యోగా భవనంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు దర్శన సేవలు ఉంటాయన్నారు. నగర ప్రజలు దర్శించుకోవాలని కోరారు. బ్రహ్మకుమారీస్ సభ్యులు జ్యోతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

బూత్‌కమిటీ సభ్యులు పకడ్బందీగా పనిచేయాలి

నగరి, మార్చి 4: నగరి నియోజకవర్గం పరిధిలో రాబోయే ఎన్నికల్లో బూత్‌కమిటీ సభ్యులు పకడ్బందీగా పనిచేయాలని నగరి మండల గుండ్రాజకుప్పం టీడీపీ, జనసేన నాయకులు పిలుపునిచ్చారు. గుండ్రాజకుప్పం పంచాయతీలో రానున్న ఎన్నికల్లో అభ్యర్థికి అధిక మెజారిటీ తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవడానికి ఈ సమావేశం నిర్వహించినట్లు టీడీపీ నాయకులు ధనంజయరాజు, ఉమాపతిరాజు, సుబ్రమణ్యం రాజు తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మెరుపుల మహేష్ మాట్లాడుతూ జనసేన, టీడీపీ కలిసికట్టుగా పనిచేస్తే టీడీపీ విజయం తథ్యమన్నారు. దేవా, నవీన్, కిరణ్, మనోహర్, దేవీప్రసాద్, చిరంజీవి, రాము, తదితర నాయకులు పాల్గొన్నారు.


బూత్‌కమిటీ సమావేశంలో పాల్గొన్న జనసైనికులు, టీడీపీ యువత

ఏనుగుల దాడిలో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేత


డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డికి చెక్కు ను అందిస్తున్న మంత్రులు

ఐరాల(కాణిపాకం), మార్చి 4: ఏనుగుల దాడిలో నష్టపోయిన రైతులకు సోమవారం రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కొట్టు సత్యనారాయణ కాణిపాక క్షేత్రంలో నష్ట పరిహారాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు 1021 మంది రైతులకు గాను 1.18 కోట్ల రూపాయల మెగా చెక్కును డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డికి అందించారు. వారు మాట్లాడుతూ గత అక్టోబరు నెలలో 1304 ఎకరాల్లో పంటను ఏనుగులు నాశనం చేశాయన్నారు. ఏనుగుల కట్టడికి అనేక ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఏనుగులను అదుపు చేయడానికి మరిన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎంపీ రెడ్డెప్ప, జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ షన్మోహన్, ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, ఏఈవోలు ఎస్వీ. కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు ఆర్థిక తోడ్పాటు


మంగళగిరి బయలుదేరిన వాహనాలను ప్రారంభిస్తున్న నేతలు

గంగాధరనెల్లూరు, మార్చి 4: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రంలోని వివిధ వర్గాలకు చెందిన బీసీలు ఆర్థికంగా ఎదగడానికి ప్రత్యేకంగా తోడ్పాటు లభించిందని జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, జిల్లా టీడీపీ ప్రధానకార్యదర్శి కోదండయాదవ్ తెలిపారు. రాజధాని అమరావతికి సమీపంలోని మంగళగిరి వద్ద నాగార్జున యూనివర్సిటీలో జయహో రాష్ట్రస్థాయి బీసీ డిక్లరేషన్ సభ మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు జరగనున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం టీడీపీకి చెందిన పలువురు నేతలు 15 కార్లలో బయలుదేరగా, శ్రీధర్‌యాదవ్, కోదండయాదవ్‌లు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహానికి టీడీపీ బీసీనేతలు పూలమాలవేసి నివాళులు అర్పించారు. జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, నేతలు జ్యోతియాదవ్, మునిరాజులయాదవ్, వరదరాజులు, వెంకటేష్‌యాదవ్, కోలా జయచంద్ర, కృష్ణమూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ పరీక్షలు


మాట్లాడుతున్న అపోలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి

చిత్తూరు రూరల్, మార్చి 4: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని చిత్తూరు అపోలో హాస్పిటల్స్ వారు ఈ నెల 4 నుంచి 15వ తేదీ వరకు చిత్తూరు ప్రభుత్వాస్పత్రి మెటర్నిటీ వార్డులో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చిత్తూరు అపోలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నేడు అనేక మంది మహిళలు క్యాన్సర్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని, ఇందుకు ప్రధాన కారణం అవగాహన లేకపోవడమేనని చెప్పారు. సుమారు రూ.15 వేలు విలువ చేసే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అపోలో సూపరింటెండెంట్ సుధాకర్‌బాబు, అపోలో ఏవో రాంగోపాల్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అఫ్రీన్, జోస్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి

పాలసముద్రం, మార్చి 4: మండల ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి, రాబోవు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పీసీసీ ప్రధానకార్యదర్శి లాయర్ మణికృష్ణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పాలసముద్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి పార్టీ నాయకులతో మార్పు కావాలి - కాంగ్రెస్ రావాలి అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పరిశ్రమలు రావాలన్నా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని చెప్పారు. కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి సుబ్బరాయలు, డీసీసీ ఉపాధ్యక్షుడు కణ్ణన్, మండల పార్టీ అధ్యక్షుడు పుష్పరాజ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్స్ ఎస్టేట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

చిత్తూరు, మార్చి 4: చిత్తూరు-తిరుపతి బైపాస్ రోడ్డులో కార్పెంటర్స్‌కు కేటాయించిన మూడు ఎకరాల్లో నిర్మించనున్న కార్పెంటర్స్ ఎస్టేట్ భవనానికి రాష్ట్ర అటవీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షన్మోహన్, రాష్ట్ర మొదిలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, పాల ఏకిరి చైర్మన్ కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్ టీచర్లకు ఇంక్రిమెంట్ మంజూరు చేయండి

చిత్తూరు (సెంట్రల్), మార్చి 4: హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో పనిచేస్తున్న పీజీ టీచర్లకు ప్రభుత్వం మంజూరు చేసిన ఒక ఇంక్రిమెంట్ ఇవ్వాలని ఎస్టీయూ నాయకులు సోమవారం డీఈవో దేవరాజును ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పీజీ టీచర్లకు ఇంక్రిమెంట్ ఇచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో ఎస్టీయూ నాయకులు దామోదర్‌రెడ్డి, మహేష్, గుణశేఖర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ

చిత్తూరు (సెంట్రల్), మార్చి 4: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ తులసి పేర్కొన్నారు. సోమవారం జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు ఓటు హక్కు వినియోగంపై నగరంలో చైతన్య ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మహిళలు, డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.